పేదల హృదయాల్లో చిరస్థాయిగా వైఎస్సార్

- వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసీఫ్
- పశ్చిమంలో ఘనంగా వైఎస్ జయంతి కార్యక్రమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నేత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసీఫ్ తెలిపారు. వించిపేటలోని ఆసిఫ్ కార్యాలయం వద్ద వైఎస్సార్ జయంతి సోమవారం నిర్వహించారు. తొలుత ఆసిఫ్ పార్టీ నగర నాయకులు ఇతర నేతలతో కలిసి వైఎస్ చిత్రపటానికి మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ ఆశయాలను కొనసాగిస్తాం, జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆసీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజారంజకమైన పరిపాలనను అందించారని చెప్పారు. అద్భుతమైన సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి యావత్ దేశంలోని నాయకులందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని చెప్పారు. ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పించిన మహనీయుడు వైఎస్ అన్నారు. ఆయన బాటలోనే తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం దేశంలో అపూర్వమైన పరిపాలనను అందించారని వివరించారు. విద్యా, వైద్య, పరిపాలన రంగాల్లో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు యావత్ దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి వ్యక్తికీ ప్రభుత్వాన్ని చేరువ చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బుదాల శ్రీనివాసరావు, నాయకులు జోజి, కర్రి గౌరి, శంకరరెడ్డి, కృపా, నయీమ్, అహ్మద్, ఉండేల శ్రీనివాసరెడ్డి, ప్రజాపతి, బాజీబాబా, నాగ, శివయాదవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

48వ డివిజన్‌లో వైఎస్సార్ జయంతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్. రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి 48వ డివిజన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి షేక్. ఆసిఫ్ విచ్చేశారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేశారు. డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, దుక్క దుర్గారావు, కోళ్ల రజనీ, షేక్.మొహరాజ్, దుక్క హరిభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అపరభగీరథుడు వైఎస్సార్....

వించిపేట(విజయవాడపశ్చిమ): అపర భగీరథుడు, ఆరోగ్య శ్రీ ప్రదాతగా చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసీఫ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తంగిరాల కృప ఆధ్వర్యంలో 49వ డివిజన్ ఫ్రెజర్‌పేటలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ 75వ జయంతిలో ఆసీఫ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేసిన నేతగా ప్రజల మనస్సుల్లో వైఎస్సార్ నిలిచారని కొనియాడారు. పేదలకు అందని ద్రాక్షగా ఉన్న కార్పొరేట్ వైద్యసేవలను ఆరోగ్య శ్రీ ద్వారా చేరువ చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. ముస్లిం మైనార్టీ వర్గాల యువత, విద్యార్థులు ఈ రోజున ఉన్నత స్థానాల్లో నిలబడటానికి ఆయన కల్పించిన 4శాతం రిజర్వేషన్ కారణం అన్నారు. ఆయన బాటలోనే మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు మంగళపూడి చంటి, నీలం దేవదానం, అడ్డూరి తమ్మారావు, రెడ్డిబోయిన మోజేష్, బుజ్జి, మార్తమ్మ, కోరే లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో పదిలంగా వైఎస్సార్...

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి తెలుగు ప్రజల హృదయాల్లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్థానం పదిలంగా ఉంటుందని వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ సమీపంలో సోమవారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యాన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భారీ కేక్ కట్‌చేసి మిఠాయిలు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ పేదల పక్షపాతి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం దారుణం..

కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సుపరిపాలన అందించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయటం దారుణం అని డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. పేదల పక్షపాతి వైఎస్సార్‌ను కించపరిచే విధంగా సంఘ విద్రోహ శక్తులు వైఎస్సార్ జయంతి బ్యానర్లు చింపివేయడం హేయ మైన చర్య అని అన్నారు. కొంత మంది అధికార మదంతో వైఎస్సార్ విగ్రహాలను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాగ్రహానికి గురికాకతప్పదు..

టీడీపీ నేతలు హద్దు మీరి ప్రవర్తించవద్దని తమ సహనానికి హద్దు ఉంటుందని గౌతంరెడ్డి అన్నారు. హద్దుమీరితే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదల శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, నాయకులు కమ్మిలి రత్నకుమార్, సామంతపూడి చిన్న, ప్రభు, స్వామి, సీహెచ్ రమేష్, కృష్ణ, గోవింద్, వికాస్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

తెలుగు ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆయన ఏం చేసినా ప్రజల కోసమే. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజా సంక్షేమమే లక్ష్యం. విపక్షాలు సైతం కొనియాడిన వ్యక్తిత్వం. జనంతో మమేకమైన జన హృదయ నేత. వెరసి తెలుగు ప్రజల గుండె చప్పుడుగా నిలిచిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి. ఆయన జయంతి సందర్భంగా సోమవారం గట్టు వెనుక ప్రాంతంలో వైఎస్సార్ సేవలను స్మరించుకుంటూ వాడవాడలా వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాధరపురం మారయ్య హోటల్ సెంటర్‌లో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ యూత్ రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. డి.రాంప్రసాద్, కె. దుర్గారావు, విజయ్, ఎస్‌కె నజీర్, బీఆర్ఎల్ గౌస్, నీలవేణి, పండు, ఇర్ఫాన్, గోమతోటి వినోద్ పాల్గొన్నారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటం వద్ద పూజా కార్యక్రమం, కేక్ కటింగ్, పండ్లు పంపిణీ చేశారు. పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా డీవీ రెడ్డి, రుద్రశంకర్, కె. హరి, ఆర్.వెంకట్, కె.లక్ష్మి, సతీష్ రెడ్డి, కరిముల్లా, ప్రభాకర్ పాల్గొన్నారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు గొంది ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి ముఖ్య అతిథిగా హాజరై వైఎస్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఆర్.అయ్యప్ప, కె.సుబ్బారావు, షఫీఉల్లా, వల్లం రవి, ఉస్మాన్ బేగ్, వీ లీలా మధు, ఎ నాగరాజు పాల్గొన్నారు. చిట్టినగర్ 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కూరాకుల నాగ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్ జయంతి వేడుకల్లో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ పాల్గొని వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్, పేద ప్రజలకు పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు దేరంగుల రమణ, బోయళ్ల రాజేష్, సోమిశెట్టి వెంకటేష్, మజ్జి శ్రీను, నన్నం దుర్గ, ఇ విజయలక్ష్మి, కుంభా నాగేశ్వరరావు, వీ మోహన్, కర్రి గౌరి, ఎస్ అశోక్, గాలి నాగరాజు, గాలి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా మహానేత జయంతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, కార్పొరేటర్లు, నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 40వ డివిజన్ భవానీపురం బ్యాంక్ సెంటర్‌లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆసిఫ్ పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేశారు. కేక్ కట్ చేశారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు పోతిరెడ్డి సబ్బారెడ్డి, మల్లెల శ్రీనివాసరెడ్డి, ఎస్ వి ఆర్ రమణయ్య కొండలరావు, కళ్ళం కృష్ణరెడ్డి, కేసరి లక్ష్మిరెడ్డి, వీరారెడ్డి, దొడ్డ రాజశేఖర్ రెడ్డి, రవి, ఉస్మాన్, ఇమామ్, నారాయణ, శివరామిరెడ్డి, బాల కాశిరెడ్డి కేసరి శ్రీకాంత్. నాగార్జున, అనిల్ పాల్గొన్నారు. 41వ డివిజన్‌లో పార్టీ నాయకులు జోసెఫ్ ఆధ్వర్యంలో మహానేత జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆసిఫ్ పాల్గొని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్‌పంపిణీ చేశారు. వైఎస్సార్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. ఆయన ప్రవేశపెట్టిన ఎన్నో సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని తెలిపారు. కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, కార్యక్రమంలో. పోలిమెట్ల శరత్, మాతంగి దుర్గారావు, జి. ఆనంద్, అజిత్, శ్రీనివాస్ రెడ్డి, సరగడా శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. 42వ డివిజన్ శివాలయం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద మహానేత జయంతి నిర్వహించారు. కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఊర్మిళా నగర్ 43 వ డివిజన్‌లో కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆసిఫ్ పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.


నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న షేక్ ఆసిఫ్


కేక్ కట్‌చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

చరిత్ర ఉన్నంత కాలం వైఎస్సార్ జీవించే ఉంటారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగు వారి చరిత్ర ఉన్నంతకాలం మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజల్లో జీవించే ఉంటారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. 51వ డివిజన్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక రాజా హైస్కూల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ రాజేష్‌తో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ జైన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మనోజ్‌కొఠారి తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట 51వ డివిజన్‌లోని బ్రాహ్మణవీధి నగరాల రామాలయం వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆసిఫ్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గురుమహంతు మహేష్, , పార్టీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షులు విశ్వనాథ రవి, నాయకులు ముదిలి ప్రసన్న, దేవర సురేష్, నాగోతి గురు, మంజు భార్గవి, నీలిమ అశోక్, కర్రి గౌరవి తదితరులు పాల్గొన్నారు. వన్‌టౌన్ 54వ డివిజన్ పరిధిలోని పంజా సెంటర్‌లో స్థానిక కార్పొరేటర్ అర్షద్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. ఖాదర్, నయీమ్, రెహమాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న షేక్. ఆసిఫ్, కార్పొరేటర్ ఆదిలక్ష్మి


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆసిఫ్


పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆసీఫ్


51వ డివిజన్‌లో పండ్లు పంపిణీని ప్రారంభిస్తున్న ఆసిఫ్, మరుపిళ్ల రాజేష్ తదితరులు


చెరువు సెంటర్‌లో మిఠాయిలు పంపిణీ చేస్తున్న రత్నకుమారి


నాలుగు స్తంభాల సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న ఆసిఫ్, నరేంద్ర రాఘవ


మారయ్య హోటల్ సెంటర్‌లో పేదలకు అన్నదానం చేస్తున్న ఆసిఫ్, రెహమతున్నీసా


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


పంజా సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


చిట్టినగర్‌లో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న భాగ్యలక్ష్మి, నాగ


52వ డివిజన్‌లో కేకు కట్ చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

ఆలయ భూముల ద్వారా మరింత ఆదాయం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయానికి చెందిన భూములు, పొలాల ద్వారా మరింత ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈవో కెఎస్.రామరావు అధికారులను ఆదేశించారు. దుర్గగుడికి చెందిన భూములతో పాటు దత్తత దేవాలయాలకు చెందిన భూములు, వ్యవసాయ క్షేత్రాలను సోమవారం ఈవో రామరావు పరిశీలించారు. గూడవల్లిలోని శ్రీకోదండ రామస్వామి వారి ఆలయం, శ్రీరామలింగేశ్వర స్వామి వారి ఆలయం భూములను పరిశీలించారు. భూములకు సంబంధించి రికార్డులు, కౌలుదారుల వివరాలను ఆలయ అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. భూముల ద్వారా ఏడాదికి ఎంత ఆదాయం వస్తుంది, ఆదాయం పెంపునకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈవో వెంట ఆలయ ఈఈ కేవీఎస్ కోటేశ్వరరావు, ఏఈవో జంగం శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

19 నుంచి గంగానమ్మ ఆలయంలో శాకంబరీదేవి ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని గంగానమ్మ వారి ఆలయంలో 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు శాకంబరీదేవి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు హరిహర అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ తెలిపారు. క్రోధి నామ సంవత్సరం ఆషాఢ మాస బహుళ త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలతో అలంకరిస్తామని చెప్పారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలు, ఆకుకూరలతో కదంబం ప్రసాదం తయారు చేసి భక్తులందరికీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. తొలి రోజైన 19వ తేదీ శుక్రవారం విశేషంగా కలిసి రావడంతో అమ్మవారి ఆలయంలో గణపతి పూజ, విశేష అర్చన, కుంకుమార్చన చేస్తామన్నారు. భక్తులు విశేష సంఖ్యలో మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పాల్గొనడంతో పాటు అమ్మవారి ఆలయ అలంకరణ నిమిత్తం అవసరమైన కూరగాయలను విరాళాలుగా అందించవచ్చన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విశాఖపట్నంకు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. శ్రీసాయి సురేఖ డాన్స్ అకాడమీకి చెందిన శిష్యబృందం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం అకాడమీకి చెందిన చిన్నారులు పలు కీర్తనలకు నృత్యం ప్రదర్శించారు. ఆద్యంతం భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. పలువురు భక్తులు చిన్నారులను అభినందించారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఆర్ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి మాజేటి సతీష్‌కుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాలలో ఆధునీకీకరించిన స్టూడెంట్ మీడియా సెంటర్‌ను సతీష్‌కుమార్, మాజేటి లక్ష్మీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని తెలిపారు. వాటికి అనుగుణంగా తమ కళాశాలల కమిటీలు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. తద్వారా విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. ముఖ్యంగా విద్యార్థులకు కేవలం తరగతి గదిలో బోధనలే కాకుండా డిజిటల్ పద్ధతుల్లో పాఠ్యాంశాలను అందించేందుకు మీడియా సెంటర్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ పాల్గొన్నారు.

నేడు స్థాయీ సంఘం ఎన్నిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ అభివృద్ధికి ఏర్పాటయ్యే స్థాయీ సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించనున్నారు. మేయర్ అధ్యక్షతన ఉండే ఆరుగురు సభ్యుల ఎన్నికకు ఇప్పటికే వైఎస్సార్ సీపీ నుంచి ఆరుగురు కార్పొరేటర్లు, టీడీపీ నుంచి ఒక కార్పొరేటర్ నామినేషన్లు వేయగా వారి మధ్య జరుగుతాయి. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ ప్రక్రియ ఉంటుంది.

మనస్తాపంతో టూరిజం ఉద్యోగి మృతి


మృతుడు రవిబాబు (ఫైల్)

భవానీపురం: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన భవానీ ఐలాండ్‌లో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగుల వేధింపులతో సెక్యూరిటీ గార్డ్ మృతి చెందారు. మృతుడి కుమారుడు అనిల్ కుమార్ కథనం మేరకు విద్యాధరపురంలో నివసిస్తున్న కత్తెరశెట్టి రవిబాబు (53) గత ఏడేళ్లుగా భవానీ ఐలాండ్‌లో అవుట్ సోర్సింగ్ కింద సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఐలాండ్‌లో ఎలక్ట్రికల్ ఏఈగా పని చేస్తున్న షంషుద్దీన్, సివిల్ ఏఈ శశికుమార్‌లు రవిబాబుతోపాటు మరో 10 మందితో మిర్రర్ ఇమేజ్, రోబోటిక్ పార్క్ వంటి యాక్టివిటీస్‌కు సంబంధించిన టికెట్లు మెషిన్ ద్వారా కొట్టిస్తున్నారు. అయితే కొన్ని సమయాల్లో పర్యాటకుల దగ్గర నగదు లేకపోవడంతో గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా డబ్బు వసూలు చేసేవారు. రద్దీగా ఉన్న సమయాల్లో మిషన్ పని చేయటం లేదని చెప్పి క్యాష్ తీసుకోమని ఆ ఇద్దరు ఏఈలు చేప్పేవారు. అలా వసూలు చేసిన డబ్బును ఎకౌంట్‌లో చూపించకుండా తమకు ఇవ్వమని బలవంతం చేసేవారు. వారు ఆ విధంగా అంగీకరించక పోవడం, అదే సందర్భంలో ఒక దినపత్రిక (సాక్షి కాదు)లో ఆ ఇద్దరు ఏఈలపై ఆరోపణలు రాగా అది టిక్కెట్లు కొట్టే వారేనన్న కక్షతో వారి మొబైల్ ఫోన్లలో గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా వసూలు చేసిన సొమ్మును వారే దిగమింగారని బీఐటీసీ జీఎమ్‌కు లేనిపోనివన్నీ చెప్పి మొత్తం 11 మందిని గత ఏడాది డిసెంబర్‌లో టెర్మినేషన్ చేయించారు. వారిలో ఒకరైన రవిబాబు అప్పటి నుంచి డిప్రెషన్‌కు లోనయ్యాడు. ఉద్యోగం నుంచి తొలగించటంతో కుటుంబాన్ని ఎలా పోషించాలో అర్థం కాక తీవ్ర ఆందోళన చెందుతూ అనారోగ్యానికి గురయ్యి ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చనిపోయాడు.

సద్గురువుల సేవలో తరించాలి

విజయవాడ కల్చరల్: సంగీత కళాకారులు సద్గురువుల సేవలో తరించాలని ప్రముఖ వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి యువకళాకారులకు సూచించారు. సుసర్ల దక్షిణామూర్తిశాస్త్రి 107వ పారుపల్లి రామకృష్ణయ్యపంతులు 76 ఆరాధానా సంగీతోత్సవాల సోమవారం నాటికార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుసర్ల దక్షిణామూర్తి ప్రత్యక్ష శిష్యులు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులని నగరంలో ఆరాధానా ఉత్సవాలకు ఆయనే ఆద్యుడని తెలిపారు. గురుకుల పద్ధతిలో సంగీతాన్ని శిష్యులకు నేర్పించి ఎందరికో సంగీత భిక్షను పెట్టారని తెలిపారు.

కార్యక్రమంలో సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, బీవీ దుర్గాభవాని పాల్గొన్నారు. స్వరార్చనలో భాగాంగా బీ సీతా మహాలక్ష్మి, పీ కనకదుర్గ, ఎస్ సాత్విక,. పెరవలి జయతి, పెవరవలి మహతి, మోదుసుధాకర్ వాగ్గేయకార కీర్తనలను ఆరంభించారు. నిర్వాహకులు ఉదయం అలంకార్ సెంటర్‌ని పారుపల్లి రామకృష్ణయ్య పంతులు చౌక్‌లోని ఆయన విగ్రహంవద్ద పుష్పాంజలి ఘటించారు.

ఘంటసాల విగ్రహస్థాపనకు కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: రాజధాని అమరావతి ప్రాంతంలో అమర గాయకుడు, కృష్ణా జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఘంటసాల విగ్రహనిర్మాణానికి ప్రభుత్వం కృషి చేయాలని వివిధ సంస్థల ప్రతినిధులు అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్‌కు సోమవారం నగరంలో వినతి పత్రం అందజేశారు. తెలుగు కళావాహిని, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలోని నగరానికి వచ్చిన బుద్ధప్రసాద్‌ను కలుకున్నారు. ఘంటసాల లాంటి గాయకులు అరుదుగా జన్మిస్తారని భావితరాలకు ఘంటసాల సేవలు తెలియడానికి నిర్మాణం చేయాలని కోరారు. బుద్ధప్రసాద్ సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్షణరావు, చింతకాయల చిట్టిబాబు. కే వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విజయవాడ-గూడూరు సెక్షన్‌లోని అప్పికట్ల-నిడుబ్రోలు-చుండూరు స్టేషన్ల మధ్యలో మూడో లైన్ నిర్మాణంలోని నాన్-ఇంటర్ లాక్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చేయడంతో పాటుగా మరి కొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 30 వరకు విజయవాడ-గూడూరు (7500), ఈ నెల 16 నుంచి 31 వరకు గూడూరు-విజయవాడ (7458), ఈ నెల 16 నుంచి 30 వరకు విజయవాడ-ఒంగోలు (7461/7576), ఈ నెల 15 నుంచి 30 వరకు విజయవాడ-గూడూరు (12744), ఈ నెల 16 నుంచి 31 వరకు గూడూరు-విజయవాడ (12743), ఈ నెల 16, 23, 30 తేదీలలో గూడూరు-విజయవాడ (17259/17260), ఈ నెల 14, 21, 28 తేదీలలో తిరుపతి-విశాఖపట్నం (22708), ఈ నెల 15, 22, 29 తేదీలలో విశాఖపట్నం-తిరుపతి (22707) రైళ్లు పూర్తిగా రద్దు.

దారి మళ్లింపు...

ఈ నెల 15, 22, 29 తేదీలలో యర్నాకులం-హౌరా (22878), ఈ నెల 22, 29 తేదీలలో సత్రగచ్చి-తాంబరం (22841), ఈ నెల 22న హౌరా-బెంగళూరు (22863), ఈ నెల 23, 30 తేదీలలో మధురై-నిజాముద్దీన్ (12651) రైళ్లు వయా రేణిగుంట, యర్రగుంట్ల, నంద్యాల, గుంటూరు, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించి నడపనున్నారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని క్లర్క్ మృతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆయిల్ ట్యాంకర్ ఢీకొని బీఎంపీఎస్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసు క్లర్క్ మృతి చెందిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన కొసన వెంకటేశ్వరరావు (50) ఆటోనగర్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసులో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఆదివారం డ్యూటీ ముగించుకుని సోమవారం ఉదయం 7 గంటలకు ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వెళుతుండగా రామవరప్పాడు వంతెన సమీపంలో ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు మృతి చెందాడు. మృతుని కుమారుడు కిషోర్ ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.